# కాంగ్రెస్‌కు ఓటు వేస్తే గోస పడతాం



బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతున్న గౌడన్నలు

## కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాలకు లబ్ధి

ఇనుగుర్తి, నవంబర్19: కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతున్నదని, కేసీఆర్ వెంటే గౌడ కులస్తులమంతా ఉంటామని ఇనుగుర్తి గీతాకార్మిక సంఘం అధ్యక్షుడు ఉమ్మగాని మల్లయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో 30మంది గీతాకార్మికులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. స్వరాష్ట్రంలో సబ్బండ వర్గాల అభివృద్ధికి పాటుపడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరో సారి అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. బానోత్ శంకర్‌నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్ మూడోసారి సీఎం కావడానికి కృషి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గౌడన్నలకు సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేసి అండగా నిలిచారన్నారు. సమైక్య పాలనలో తమను ఎవరూ గుర్తించలేదని, కేసీఆర్ మేము అడగకున్నా అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వివరించారు. పార్టీలో చేరిన వారిలో వేముల సారంగపాణి, గండు లక్ష్మణ్, కందునూరి వెంకటేశ్వర్లు, వెంకన్న, ఉమ్మగాని సోమయ్య, కొమురయ్య, కూటికంటి సారయ్య, సూరయ్య ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గండు నాగన్న, మండల యూత్ మాజీ అధ్యక్షుడు కూటికంటి మధు, గడ్డం శ్రీకాంత్, నవనందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

## సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

కేసముద్రం, నవంబర్ 19: మండలంలోని ధన్నసరి శివారు ఫారెస్టు ఉసిరి వనంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మహబూబాబాద్‌లోని మహాలక్ష్మి గణపతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 108 మంది దంపతులు సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్– సీతామహాలక్ష్మి దంపతులు పాల్గొని ఉసిరి చెట్టువద్ద పూజలు చేశారు. ఎస్వీ నాగేశ్వర్‌రావు, శ్రీరంగం రామారావు, సోమ శ్రీనివాస్, సామ రాంబాబు, మడూరి లింగమూర్తి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్ దంపతులు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

సంగెం, నవంబర్ 19 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో లావణ్య సూచించారు. సంగెం మండలంలోని కాపులకనపర్తి సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో కాపులకనపర్తి, గవిచర్ల, షాపూర్, తీగరాజుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## 'ఆరోగ్య సంరక్షణకు నడక తప్పనిసరి'

పరకాల, నవంబర్ 19 : ఆరోగ్య సంరక్షణకు తప్పకుండా ప్రతి రోజూ నడవాలని భూపాలపల్లి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కోడూరి నవీన్ అన్నారు. పట్టణంలోని వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ వాకర్‌గా ఎంపికైన హోంగార్డు కట్కూరి కుమార్‌ను ఆదివారం సన్మానించారు. ప్రస్తుత జీవన విధానంలో ప్రతి ఒక్కరు ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

### కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 19: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే గోస పడుతామని బీఆర్‌ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు ఇస్లావత్ కవితా రాంజీనాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని అమనగల్, గుండాలగడ్డ తండా పరిధిలోని మిర్చి తోటలో కూలీలకు మ్యానిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కేవలం ఓట్ల కోసమే మాయమాటలు చెబుతున్నదని, ప్రజలు మోస పోవద్దన్నారు. గత కాంగ్రెస్ పాలనలో గ్రామాలను ఏమాత్రం అభివృద్ధి చేయలేదని, సీఎం కేసీఆర్ ప్రతి కాలనీకి సీసీ రోడ్లు ఏర్పాటు చేయించారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రగతి పథంలో నిలిపారన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మంజుల, పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేసముద్రం: కారు గుర్తు చూపించి ఓటు అడుగుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

## బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోపై విస్తృత ప్రచారం

బయ్యారం : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఇల్లెందు అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్ గెలుపే లక్ష్యంగా మండలంలోని పార్టీ శ్రేణులు మ్యానిఫెస్టోతో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆదివారం ఇర్సులాపురంలో ఎనుగుల ఐలయ్య, వెంకట్రాంపురంలో జర్పుల శ్రీను, జగ్గుతండాలో వెంకటకృష్ణ, రామచంద్రాపురంలో గుగులోత్ సురేశ్, సంత్రాల పోడ్ తండాలో వినోద్, జానీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన అన్నపూర్ణ, కేసీఆర్ బీమా, రూ. 400లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ ఓట్లు అభ్యర్థించారు.

## సీఎం కేసీఆర్‌తోనే రైతులకు ప్రయోజనం

కేసముద్రం: సీఎం కేసీఆర్‌తోనే రైతులకు ప్రయోజనం కలుగుతుందని బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు పనికర కొమురయ్య అన్నారు. బీఆర్‌ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌ను మరోసారి గెలిపించాలని కోరుతూ ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల పెట్టుబడికి రైతులకు సహాయం చేయాలనే ఆలోచన 47 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు రాలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ గోదావరిపై నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో గ్రామాల్లోని చెరువుల్లో 365 రోజులు నీరు ఉంటున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ కోసం తీవ్ర ఇబ్బందులు పడిన విషయాన్ని రైతులు గమనించాలన్నారు. మరణించిన రైతుల కుటుంబాలను ఆదుకోవడంలో గత పాలకులు విఫలమయ్యారని, సీఎం కేసీఆర్ రూ.5లక్షలు ఇచ్చి ఆదుకుంటున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్, ప్రతి కుటుంబానికి రూ.5లక్షల బీమా, రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం, సౌభాగ్యలక్ష్మితో మహిళలకు రూ.3వేలు అందిస్తారని పేర్కొన్నారు. ఎంపీటీసీ గుజ్జునూరి రాజు, పార్టీ నాయకులు నాగెల్లి శ్రీనివాస్, బీరం రామ్మోహన్ రెడ్డి, పనికర యాకమల్లు, దాసరి మధు, చెల్లగోల అనిల్, దద్దు సందీప్, శ్రీరాంరెడ్డి, ఎసల్ల ఎల్లయ్య పాల్గొన్నారు.



బయ్యారం: జాఫర్‌బాద్‌లో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



మహబూబాబాద్ రూరల్: కూలీలకు కరపత్రాలు అందిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న కవితా రాంజీనాయక్



బయ్యారం: ఇర్సులాపురంలో మ్యానిఫెస్టోను వివరిస్తూ ప్రచారం చేస్తున్న నాయకులు

## రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

### జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్




కొనుగోళ్లపై సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

మహబూబాబాద్, నవంబర్ 19: వరిధాన్యం కొనుగోళ్ల విషయంలో ఖచ్చితమైన ప్రమాణాలను పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అదనపు కలెక్టర్ ఎం డేవిడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఐడీవోసీలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై పీఏసీఎస్, ఐకేపీ, మెప్మా, జీసీసీ నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డేవిడ్ రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో అన్ని రకాల వసతులు, సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎక్కడా రైతులకు ఇబ్బందులు జరగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, టార్పాలిన్లు, ఇతర పరకరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షిద్, పౌర సరఫరాలశాఖ అధికారి రవీందర్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ కృష్ణవేణి, జిల్లా మార్కెటింగ్ అధికారి వెంకట్‌రెడ్డి, జీసీసీ జిల్లా మేనేజర్ సమ్మయ్య, ఐకేపీ డీపీఎం నళిని, మెప్మా కోఆర్డినేటర్ విజయలక్ష్మి, పాక్స్ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## 23, 24 తేదీల్లో హోం ఓటింగ్ : ఆర్వో

మహబూబాబాద్, నవంబర్ 19: ఈ నెల 23, 24 తేదీల్లో 12–డీ ఫామ్ ద్వారా అర్జీలు పెట్టుకున్న 80 ఏళ్ల వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే హోమ్ ఓటింగ్ చేపడుతున్నట్లు మహబూబాబాద్ రిటర్నింగ్ అధికారిణి అలివేలు తెలిపారు. ఆదివారం హోమ్ ఓటింగ్‌పై 102–మహబూబాబాద్ నియోజకవర్గ కార్యాలయంలో వివిధ పార్టీల ప్రతినిధులతో నిర్వహించి సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో 30 రూట్‌లలో గుర్తించిన 471 మంది హోమ్ ఓటింగ్ ఓటర్ల నివేదికను సంబంధిత పార్టీల ప్రతినిధులకు అందజేస్తూ హోమ్ ఓటింగ్ చేపడున్నామని తెలిపారు. ఈ ఓటింగ్‌కు అర్జీ పెట్టుకున్న ఓటర్లందరూ ఇచ్చిన అడ్రస్‌లో ఉండాలని సూచించారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

మహబూబాబాద్, నవంబర్ 19: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే శశాంక అన్నారు. ఆదివారం ఐడీవోసీలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఇరా సింఘాల్, ఎన్నికల వ్యయ పరిశీలకుడు బాబు రాయ్ సమక్షంలో అదనపు కలెక్టర్ ఎం డేవిడ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. డోర్నకల్‌లో 101, మహబూబాబాద్‌లో 102 నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల పరిధిలో ఈవీఎం, వీవీప్యాట్‌లపై ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో మొత్తం 539 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గంలో మొత్తం 32, మహబూబాబాద్ నియోజకవర్గంలో 32 రూట్లు ఏర్పాటు చేశామన్నారు. రూట్ ఆఫీసర్‌గా సెక్టోరల్ అధికారులు ఉంటారని, ప్రతి అధికారి పరిధిలో 3 నుంచి 4 పోలింగ్ కేంద్రాలు ఉంటాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాలన్నీ రెండు లేక మూడు కిలోమీటర్ల పరిధిలోనే ఉంటాయని, ప్రతి నియోజకవర్గంలో తిరిగేందుకు 32 మంది సెక్టార్ అధికారులు ఉంటారని పేర్కొన్నారు. అదనంగా ఏర్పాటు చేసిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు సిద్ధంగా ఉంటాయని, పోలింగ్‌కు ఎటువంటి ఇబ్బందులు ఉండవని వివరించారు. డోర్నకల్‌లో పోటీలో ఉన్న అభ్యర్థులు మొత్తం 14 మందితో కలిపి నోటాతో 15 సీరియల్ నంబర్ల బ్యాలెట్ సంఖ్య ఉంటుందని, మహబూబాబాద్‌లో 12 మంది, నోటాతో కలిపి 13 సీరియల్ సంఖ్య బ్యాలెట్‌లో ఉంటుందన్నారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఎలాంటి అనుమానాలున్నా పార్టీల ప్రతినిధులు నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమీక్షలో డోర్నకల్ రిటర్నింగ్ అధికారి నర్సింహారావు, మహబూబాబాద్ రిటర్నింగ్ అలివేలు, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.